# నమ్మకం

- డి.శ్రీనివాసరావు

ఆరోజు గోల్డ్‌మర్చంట్ మాధవయ్యగారిల్లు కిటకిటలాడుతోంది. దానిక్కారణం ఆంధ్రుల అభిమాన అందాలతార లావణ్య అక్కడికి కొద్దిసేపట్లో వస్తుండటమే. పేరుకు తగ్గట్టుగానే ఉంటుందనేమో ఆబాలగోపాలము ఆమె రాకకోసం కళ్ళల్లో వత్తులు పెట్టుకుని మరీ చూస్తున్నారు. ఆ విషయంలో నేను వారికంటే రెండాకులెక్కువే.

ఏమాత్రం ఎక్స్‌పోజింగ్‌కి తావివ్వని లావణ్య ప్రవర్తన మీద కూడా నాకు మాంచి నమ్మకం. ఆమె అభిమాన సంఘానికి ఐదు సంవత్సరాలుగా నేను సెక్రటరీగా ఉంటున్నాను. ఆమె సిన్మా విడుదల కాబోతుందంటే, నెలరోజుల ముందుగా మా బిజీ అంతా ఇంతా కాదు. ఆమెలో ఉన్న అనిర్వచనీయమైన ఆకర్షణ మమ్మల్ని అలా చేయిస్తుందేమో.

ఈలోగా... కొద్ది నిముషాల్లో వస్తుందన్న వార్త ప్రజల్లో ఆతృత కలుగజేస్తోంది. అనుకున్నట్లుగానే తెల్లని మారుతీకారులో పసిడిరంగు పట్టుచీరలో లావణ్య దిగింది. ఒక్కసారి... అంతకు ముందులేని వెలుగు సడన్‌గా చోటుచేసుకుంది. ఆమె కట్టుకున్న చీరరంగు ఆమె మేనిఛాయతో మ్యాచ్ అయింది. ప్రజలందరికీ ఒక్కసారి నమస్కరించి లాన్‌లో నుండి నడుస్తుండటంతో మత్తెక్కించే ఆమె ఒంపుసొంపులు ప్రజలకు మతిపోయేట్లు చేశాయి. దాంతో ద్విగుణీకృతమైన ఉత్సాహంతో ముందుకురికారు కొందరు యువకులు. ఈలోగా పోలీసులొచ్చి పరిస్థితిని చక్కబరిచారు.

సంఘం తరపున మాకు ఆమెని చూసే భాగ్యం త్వరగా కలిగింది. నన్ను నేను పరిచయం చేసుకున్నాను. సున్నితంగా ఆమె కరచాలనం చేయడంతో నా ఆనందానికి అవధుల్లేవ్. ఎన్నో ఏళ్ళుగా భగవంతుని సేవ చేస్తున్న భక్తునికి దైవసాక్షాత్కారం లభిస్తే ఎట్లా ఉంటుందో అలానే ఉంది నా పరిస్థితి. మా ఊళ్లో ఆమెకున్న అభిమానుల గురించి, అభిమాన సంఘం గురించి మేం చేస్తున్న కార్యక్రమాల గురించి వివరించాను. అంతా జాగ్రత్తగా విని ఈసారి హైదరాబాద్ వచ్చినపుడు కలవండి అనడంతో ఆమె ఆహ్వానాన్ని అర్జంట్ టెలిగ్రామ్‌గా భావించాను. ఆమె మరోవారం రోజులుపోతే గాని హైదరాబాద్ చేరుకోదని తెలిసి కాస్త నిరాశచెందాను. అయినప్పటికీ నా ప్రయాణ ఏర్పాట్లన్నీ ప్రారంభించాను.

ట్రెయిన్ ఇంకా రెండు గంటలు అయితేగాని రాదని తెలిసినా బయలుదేరడానికి సిద్ధం అయ్యాను. నేనొస్తున్న సంగతి బాలూకి ముందుగానే తెలియడంతో రైల్వేస్టేషన్‌కి వచ్చి రిసీవ్ చేసుకుంటానన్నాడు. బాలూ నా బాల్యమిత్రుడు. పదో తరగతి వరకూ మా ఊర్లోనే చదువుకున్నాం. కర్రాబిళ్ళ దగ్గర్నుండి క్రికెట్ వరకూ మేం ఒకటీంలో ఉండాల్సిందే. అలా సాగిన మా స్నేహం వాళ్ళ నాన్నగారి ఉద్యోగరీత్యా బదిలీ వలన కొంతతగ్గింది. అయినా అపుడపుడు ఉత్తరాల ద్వారా కొనసాగుతునే ఉంది మాస్నేహం. ట్రెయిన్ అనుకున్నట్లుగానే కరెక్ట్ టైమ్‌కే సికింద్రాబాద్ చేరుకుంది. బాలూ వచ్చి నన్ను రిసీవ్ చేసుకుని ఇంటికి తీసుకెళ్ళాడు. అన్నివిషయాలు మాట్లాడుకున్న తర్వాత నారాకకు గల కారణాన్ని తెలుసుకుని చాలా బాధపడ్డాడు. ఇటువంటి పనులు అంత శ్రేయస్కరం కాదని, తన కంపెనీలో జాబ్ చూస్తానన్నాడు. వెళ్ళిన మూడోరోజుకి లావణ్య అపాయింట్‌మెంట్ దొరికింది.

శనివారం రాత్రి తొమ్మిది గంటలకి ఆమెని కలిసే అదృష్టం వరించడంతో ఆరోజు సాయంత్రం ఐదు గంటలకే బయలుదేరాను. దార్లో షాపింగ్ చూసుకుని అనుకున్న టైంకి అరగంట ముందుగానే జూబిలీహిల్స్ చేరుకున్నాను. మరికొద్దిసేపట్లో లావణ్య ఇంటికి చేరుకున్నాను. బయట అనుమతి తీసుకొని లోనికి ప్రవేశించాను. విశాలమైన, విలాసవంతమైన భవంతిలో ఒక్కతే కూచుంది. ఆమెని పలుకరించడంతో కూర్చోమని చెప్పింది. విశేషాలేంటి అనడగడంతో సంఘ కార్యక్రమాలకోసం, ఆవిడ సిన్మాలు ఎక్కువరోజులు ఆడేందుకు మేం చేస్తున్న కృషిని గుర్చి వివరించాను. చాలా కలుపుగోరుతనంతో మాట్లాడింది.

ఇదే అదనుగా ఆమెపై తనకున్న ప్రత్యేక అభిమానాన్ని గురించి చెప్పి, తనకు




అభ్యంతరం లేకపోతే పెళ్ళి చేసుకుంటానన్నాను. ఇది ఇప్పటి కోరిక కాదనీ, ఎన్నో ఏళ్ళుగా నాలోని గూడుకట్టుకొని ఉన్న కోరికని చెప్పాను. దాంతో ఉలిక్కిపడి, కొంచెంలో తేరుకుని, ''చూడు నాయనా... నీలా చాలామంది వస్తూ పోతూంటారు. దాంట్లో కొందరికి ఇటువంటి ఆలోచన రావడం సహజమే. నా అందం చూసో డబ్బు చూసో ఆమాట అనొచ్చు. మేం అందరికీ మాటివ్వలేంకదా. మాలెవల్‌కి తగినట్లుగా చూసుకుంటాం.'' అంటూ ఇంకా ఎన్నోనీతులు చెప్పింది. దాంతో హతాశుడనయ్యాను.

ఈలోగా ఫోన్ రింగయింది. ''చూడండి మూర్తిగారు నేను పదిన్నరకల్లా షూటింగ్‌కి హాజరుకావాలి'' అంటూ ఇండైరెక్ట్‌గా నన్ను సెలవు తీసుకోమంది. ఎలా బాలూ ఇంటికి చేరుకున్నానో నాకే తెలీదు. జరిగినదంతా బాలూకి చెప్పాను. పెద్దగా బాధపడలేదు. తగినశాస్తి జరిగిందన్నాడు. ఆమెకి నీగురించి, నీకు వాళ్ళ గురించి ఏం తెలుసని ఇటువంటి నిర్ణయం తీసుకున్నావ్? ఆమెమీద నీకెందుకు అంత నమ్మకం. ఏంటి ఇటువంటి నిర్ణయాలు...'' అంటూ సుదీర్ఘంగా మందలించాడు.

కొంచెంసేపు ఇద్దరి మధ్య నిశ్శబ్దం చోటుచేసుకుంది. ''పదా.. భోజనానికి'' అనడంతో బాలూ నేను భోజనాలు చేశాం. ఎలా పడుకున్నానో, ఎపుడు పడుకున్నానో నాకే తెలీదు.

నిద్రలేచాను. సమయం, ఎనిమిది గంటలు దాటింది. మనసంతా చికాగ్గా ఉంది. కొద్దిసేపట్లో బాలూ కాఫీతో ప్రత్యక్షం. నిన్న తిట్టినందుకు పరిహారంగా అన్నట్లు. బెడ్ కాఫీ తాగి పేపర్ తిరగేసాను. అంతే... ఆశ్చర్యం- మత్తొదిలిపోయింది. హెడ్‌లైన్స్‌లో ఓ వార్త- 'ప్రముఖ నటి లావణ్య అరెస్ట్' దాని సారాంశం ఏంటంటే గతరాత్రి పదకొండు గంటలకి నగరంలో ఓ పేరుమోసిన హోటల్‌లో జరిగిన రెయిడింగ్‌లో నటి లావణ్య ప్రముఖ వ్యాపారవేత్త కిషన్‌తో పట్టుబడినట్లు. నాకు నీతులు చెప్పి పన్నెండు గంటలుకూడా కాలేదు... నిన్న షూటింగ్ అని చెప్పింది. ఇదేగాబోలు. బాత్రూంలో ఉన్న బాలూని కేకేసాను. వార్త చదివి అదోలా చూశాడు 'జ్ఞానోదయం అయిందా' అన్నట్లుగా.

★